స్వయంకృషి

By

K. VEERESALINGAM

45

1894

స్వయంకృషి

మనము లోకములో సస్యముల విషయమునఁగాని ఫలవృక్షముల విషయమునఁగాని కృషిచేయుటవలనఁ గలుగవలసిన ప్రయోజనమంతయు సస్యాదులు చక్కఁగా పెరిగి ఫలము నిచ్చుట యయియున్నది. ఆ ప్రకారముగానే మనము స్వవిషయమునఁ గృషి చేయవలెనన్నను, మన మభివృద్ధి చెంది లోకమున కుపయోగపడునట్లు చేయవలెననియే కాని వేఱుకాదు. మొట్టమొదట స్వతస్సిద్ధముగా పెరిగెడి స్వభావము దానియందున్నసే కాని, ఏ వస్తువునుగాని మనము పెంచుటకు శక్తులము కానేరము. మన మొక వృక్షమును దోహదము చేసి పెంచఁగలము గాని యొక యెండుమోడు నెప్పుడును పెంచుటకు శక్తులముకాము. ఆ రీతినే మనము స్వయంకృషి చేయవలయునన్నచో మన కీశ్వరుఁడు ప్రసాదించియున్న నానాంకురాదుల నభివృద్ధిపఱచుకోవలయు ననుటయే కాని స్వభావముచేత మనకు లేనివానిని క్రొత్తగా తెచ్చిపెట్టుకోవలయుననుట కాదు. అయినను సస్యాదుల యభివృద్ధికిని మనయభివృద్ధికిని మిక్కిలి వ్యత్యాసమున్నది. వానికివలె మనకు పాంచభౌతికమైన శరీరమొక్కటియేకాక తద్విలక్షణమైన యాత్మకూడ నుండియున్నది. మనకుఁగల జ్ఞానాదిశక్తులు ప్రత్యేకముగా నాత్మతోడనే సంబంధించినవి. ఈ జ్ఞానాది శక్తులచేతనే మనము వృక్షాది జడపదార్థములనుండియేకాక పశుపక్ష్యాది సమస్తేతర జంతువులనుండియు భేదపడియెదము. మనుష్యుఁడు సృష్టిలోని పదార్థములలో నెల్లను శ్రేష్ఠుఁడనుట నిర్వివాదాంశము; ఆశ్రేష్ఠత్వమునకుఁ గారణము జ్ఞానసంపద కలిమియేయనియు సర్వానుభవసిద్ధమయిన రాద్ధాంతాంశమే. పశుపక్షివృక్షాదులకును మనకును

సామాన్యమయిన భౌతికదేహ మాహారముచేతనే పెరుగఁదగినది; అట్టిదేహము నొక్కదానినే పెంచుకొనుటవలన వానికంటె మన కాధిక్య మెంతమాత్రమును గలుగఁబోదు. మనము జ్ఞానదేహము నెంతయభివృద్ధి పొందించుకొన్న మనకంత యాధిక్యము కలుగును. కాఁబట్టి యిప్పుడు నేను చెప్పఁబోయెడు స్వయంకృషియంతయు ముఖ్యముగా నాత్మాభివృద్ధితోడ సంబంధించినదిగానే యుండును. స్వయంకృషి చేసి యభివృద్ధి పొందుటవలనఁ గలుగవలసిన ఫలము సుఖానుభవము. మృగాదులు తాత్కాలికానుభవమునుమాత్రమే చూచుకొనును గాని ముందుసంగతి విచారించుకోవలయునను జ్ఞానము వానికెంతమాత్రమును లేదు. ఒక గోవునకు విస్తారముగా గడ్డి వేసితిమేని, అది తనకప్పుడు కావలసినంత తిని, తక్కిన దానిని త్రొక్కి పేడవేసి పాడుచేయునే కాని తినఁగా మిగిలిన దానిని మఱునాటి దినమునకు భద్రపఱుచుకొనుటకై లేశమును ప్రయత్నింపదు. మనుష్యుఁ డొక్కఁడే యప్పటి సుఖమును మాత్రమే కాక భావికాలమునందలి సుఖమును గూడ దృష్టియం దుంచుకొని దానిని కాపాడుకొనుటకయి ముందుగానే తగిన సదుపాయములను విచారించువాఁడు. కాఁబట్టి లోకములో బుద్ధిమంతుఁడైన వాఁడెప్పుడును తాత్కాలికతుచ్ఛసుఖములయందే తగిలియుండక యప్పటి యల్పసుఖములను గొన్నిటిని మానుకొనియైనను ముందు రాఁబోయెడు గొప్పసుఖమునకై పాటుపడుచుండును. ముందుసంగతిని బొత్తిగా విచారింపక యా కాలపు చిఱుసుఖములతోడనే తృప్తినొంది యుండువాఁడు మూర్ఖుఁ డనఁబడును; అట్టివానికిని మృగాదులకును జ్ఞానసంపదయందు విశేషభేద ముండదు. అల్పసుఖములను పాటింపక యధికసుఖమునకై శ్రద్ధ వహించుట బుద్ధిమంతుల లక్షణమని సూచించి యున్నానుగదా? ఇప్పుడు లోకములోని వారందఱును ధనలాభ మపేక్షించియో, ఇంద్రియసుఖము

లను గోరియో, ప్రఖ్యాతి కాసించియో, ధర్మబుద్ధి గలిగి పరలోకమును కాంక్షించియో తమ కాలమును గడుపుచుందురు. ధన మెప్పుడును మన సుఖమున కనుకూలమయిన పదార్థములను సంపాదించుకొనుటయం దుపయోగపడునే కాని ప్రత్యేకముగా సుఖసాధనము కాదు. కాఁబట్టి మన సుఖభోగాదుల కక్కఱకు వచ్చునంతవఱకే ధనము ప్రయోజనకరమగును. ఈ సంగతిని విచారింపక కొందఱు మూఢాత్ములు ధనాశచేత నేలాగుననో దానిని సంపాదించి పెట్టెలలోనో మఱివేఱుచోటనో దానిని భద్రపఱిచి, తా మనుభవింపకయు నితరులకు పెట్టకయు దరిద్రులతో సమానముగా కష్టజీవనమును చేయుచుందురు. అట్టివారిసంగతి నిక్కడ విడిచిపెట్టి భోగత్యాగముల నిమిత్తము ధనమును సంపాదింపఁ బ్రయత్నించువారిమాటే యిక్కడ విచారింతము. ధనార్జనముతప్ప వేఱుచింతలేని వారెప్పుడును కొన్ని యక్రమములకు లోఁబడక విశేషవిత్తమును పోగుచేయఁజాలరు. అట్టివారి నొంటిగా నున్నప్పుడును పూర్వము చేసిన కార్యములు తలంపునఁ బాఱినప్పుడును అంతరాత్మ బాధించుచుండును గనుక వారు నిజమయిన సుఖము ననుభవింపఁజాలరు; ఒకానొకప్పుడు ధనాశచేత చెడుపనులకు లోనయినను ధనము లభింపక మనస్తాపము సంభవింపవచ్చును; ఫలకాలము వచ్చునప్పటికి సంపాదించిన ధనమునకు ఱెక్కలువచ్చి మనయొద్దనుండి యెగిరిపోయి దొంగలపాలో యితరులపాలో కానైనను కావచ్చును; లేదా యనుభవించుకాలము వచ్చునప్పటికి మధ్య నాకస్మికముగా మృత్యుదేవత యడ్డమువచ్చి మన ధనమునకును మనకును నెడఁబాటు కలిగించి మనల నీ లోకమునుండి యెగయెత్తుకొని పోవచ్చును. కాఁబట్టి చక్కఁగా విమర్శించి చూడఁగా ధనమువలనఁ గలిగెడి సౌఖ్యము మిక్కిలి యస్థిరమయిన దనియు నల్పమయిన దనియుఁ దేటపడుచున్నది. అందుచేత

బుద్ధిమంతుఁడయినవాఁడు ధనార్జనమే పరమప్రయోజన మని నమ్మి కొని యందునిమిత్తమే తన యమూల్యమైన జీవితకాలమును ధార పోయుట యుక్తమయిన పనికాదు. ఈ ప్రకారముగానే కేవలము నింద్రియసుఖములనిత్తమే కాలము పుచ్చుటయు నుచితకార్యముగా గనుపట్టదు. ఇంద్రియసుఖములు మృగాదులకును మనకును సామా న్యములే యనియు, మనుష్యుల మగుటచేత మన కావశ్యకములుగా నేర్పడిన ధర్మములను పాటింపక విషయసుఖములయందే యాసక్తుల మయి యున్నచో మృగాదులకన్న మన కెక్కువ మేలిమి రానేర దనియు ఈ వఱకే చెప్పియున్నాను. ఆ యల్పసుఖమయినను చిరకాల ముండునని నమ్ముటకయిన వీలులేదు. ప్రతిదినమును సూర్యుఁ డుద యించి యస్తమించులోపల లక్షలకొలఁది జనులు మృతినొందు చుందురు. ఎప్పుడో యే నిమిషముననో మనమును ప్రపంచములోని సర్వము విడిచిపెట్టి లోకాంతరగతులము కావలసినవారమే యగు దుము; మన శక్తియంతయు వినియోగపఱిచి యింద్రియసుఖసాధన ములకయి పాటుపడి వానిని సంపాదించుకొనువఱకు వానికిని మనకును వినియోగము కలిగి సుఖమునకు మాఱుగా బహుతరముగా దుఃఖము సంభవించుచుండుటయు తటస్థించుచున్నది; ఒకవేళ నప్పటికి సుఖము గానే కనఁబడినను కొన్నివిషయములలో నా సుఖమంతయు కడపట దుఃఖముగానే పరిణమించుటయుఁ గలదు. ఇప్పు డీదేశములో నతి భోజనము, అతిపానము, అతిసంభోగము, ఇంద్రియసుఖములలో నెల్లను సర్వసాధారణములయి యున్నవి. ఈ యతిభోజనము యాచ్ఞావృత్తి వలననే జీవనముచేయు బ్రాహ్మణులలో నధికముగాఁ గనఁబడు చున్నది; వారు యాచ్ఞావృత్తి యెంతమాత్రమును హేయమయిన దని తలఁపకపోవుటయే కాక మీఁదుమిక్కిలి యా వృత్తియే మిక్కిలి గౌరవావహమయిన దని యెంచి సంతోషమును పొందుదురు; ఒక్క

పూట తిండికయి గ్రామము విడిచి పొరుగూళ్ళకు సహితము పోవుదురు; వారు కడుపే కైలాసమని యెంచుకొని లోకములో జన్మించుట యెల్లను తిండికొఱకే యని వేఱుచింత లేక యుందురు; సంతర్పణములును సమారాధనలును జరుగునప్పుడు మనము కొంచెము శ్రమచేసి యీ మార్గమున వెళ్ళుదుమేని, అతిభోజనము చేసి యాయాసపడుచు నడవలేక నడుచువారిని, నేయియు భక్ష్యములును నధికముగా భుజించి కడుపునొప్పిచేత వీధియరుగులమీఁద పడి పొరలు వారిని మన మనేకులను చూతుము. అప్పటి వారిస్థితిని జూచినప్పుడు మృగముల స్థితియైనను అంతకంటె కొంత మేలయినదే యని తోచవచ్చును. ఏ మృగముగాని మితము తప్పి తిని బాధపడుచుండఁగా మన మెప్పుడును జూచియుండలేదు. భోజన మొక్కటియే పరమార్థ మనుకొను వారికిఁ గల యితరకష్టములును మృగాదులకు లేవు. కష్టపడ నక్కఱలేకయే విస్తళ్ళు వేసి వడ్డించి యుంచినట్టుగా భగవంతుఁడు మృగాదులకాహారము నెల్లయెడల నమర్చియున్నాఁడు; ఒకయావు గడప దాటి వెళ్ళినచో పాకము చేసికోవలసిన శ్రమతో పనిలేక మేయుటకుఁ గావలసినంత పచ్చిక సిద్ధముగా నుండును. బీదలగు బ్రాహ్మణుల స్థితి యిట్లుండఁగా ధనికులయిన నానాజాతులవారిలోను పలువిధములయిన రోగముల కాకరములయిన మధురాహారాదుల నతిమాత్రముగా భుజించి నిజమయిన సౌఖ్యమునకు దూరులయియుండుటయు ప్రబలియే యున్నది. అతిభోజనమునకంటెను సహస్రగుణముల నష్టము నాపాదించుచు నంతకంతకు సురాపానము మనదేశములో మిక్కిలి వ్యాపించుచున్నది. ఈ క్రైస్తవప్రభుత్వము మన దేశమునకు రానప్పుడీ విషయమున మనదేశము తక్కిన దేశములకంటె మిక్కిలి మంచిదశయందే యుండియున్న దనుటకు సందేహము లేదు. అప్పుడు మనపూర్వులు పల్లెలయందుసహిత మీ కాలమందు వినఁబడు ద్రాక్షాసవాదుల పేరునైనను

విని యుండరు; మనపెద్దలు సురాపానము మహాపాతకముగా నేర్పఱచి పానమూర్తులతో సహవాసము చేసినవారిని సహితము మహాపాతకుల లోనే గణించుచు వచ్చినందున త్రాగుఁబోతుతన మాకాలములో మిక్కిలి తక్కువగానుండెను. ఈ హూణప్రభుత్వము మనదేశమున వ్యాపించిన తరువాత ఈ దేశపు సారాయములుమాత్రమే కాక యిచ్చటి వారల కడుపులను పవిత్రము చేయుటకయి వివిధనామములు ధరించిన యన్యదేశీయసారాయములు సహితము నెలకు నాలుగుసారులు ఓడల కొలఁది బుడ్లతో పంపఁబడుచున్నవి. ఏ దేశమునందుఁగాని సాధారణ ముగా జరుగు నేరములలో సగముపాలు త్రాగుఁబోతులవలనఁ జేయఁ బడినవిగానే యుండును. సమస్తదోషములకును కుదురయిన యీ వ్యా పారమును దొరతనమువారే ప్రోత్సాహపఱచుచుండుట చూడ నెంతయు వింతగానున్నది. నేరములు జరిగిన తరువాత దోషులను పట్టి శిక్షించుటకంటె నేరముల యుత్పత్తికారణమును కనుఁగొని దానిని వారింపఁ బూనుకొనుట దొరతనమువారికి ముఖ్యకర్తవ్యము. తమకు విధియైన కృత్యమును చేయక యుపేక్షించుచున్నారు కనుక, మన దేశస్థు లందఱును జేరి యీ వ్యాపారము సమస్తజనులలోనుకూడ వ్యాపించి మిక్కిలి ముదురక మునుపే ప్రభుత్వమువారికి సంఘవిజ్ఞాప నలను బంపి త్రాగుఁబోతుతనమును నిర్మూలించుటకయి తగిన ప్రయ త్నము చేయవలయును. మఱియు మన ధర్మశాస్త్రములే పురుషుఁడు బహుభార్యలను జేసికొనుట కనుజ్ఞ నిచ్చుచున్నవి. అయినను, అందు వలనఁ గలిగెడి నష్టము సంస్థానాధిపతులలో కొందఱికేగాని జన సామాన్యమున కంతగాఁ గలుగుచుండ లేదు. ఏమి కాలధర్మదోష ముననో కాని చిరకాలమునుండి మనదేశములో వ్యభిచారమునకయి ప్రత్యేకముగా నేర్పడి భోగస్త్రీలను పేరుగల యొకజాతిస్త్రీలు పరంప రగా వచ్చుచున్నారు. అట్టివారికి నిరుత్సాహమును కలిగించుటకు

మాఱుగా కొంచెము ధనముగల మనవారు పలువురు వేశ్యల నుంచుకొనుటచేతనే ప్రతిష్ఠను వహించుచున్నారు. వేశ్యల నుంచుకొన్నవారికి పూర్వకాలములయందు రాజస్థానములలో గౌరవము లేకపోవుటంజేసి యప్పుడెవ్వరో నీచులు తప్ప నలుగురిలోను తలయెత్తుకొని తిరుగఁదలఁచిన వారెవ్వరును వ్యభిచరించి తిరుగుటకు సాహసింప కుండిరి. ఇప్పటి రాచఱికమువా రాంతరంగిక ప్రవర్తనవిషయమున తాము సంబంధమును కలిగించుకోకుండుటంజేసి, యాయడ్డముకూడ నిప్పు డూడి యెల్లవారును స్వేచ్ఛముగా భోగస్త్రీలతోడి సాంగత్యమును కలిగించుకొనుచున్నారు. బిళ్ళగోచిని పెట్టకుండుట తప్పుగా నెంచుచున్నను, కులమువారిప్పుడు వ్యభిచారమును తప్పుగా నెంచుటయే మానివేసినారు. కాఁబట్టి కులమువా రీ దురాచారమును మాన్పించుటకయి ప్రయత్నము చేయరని వేఱుగ చెప్పనక్కఱయే లేదు. ఈ మూఁడువిధములయిన సుఖములును మనశరీరమునకే సంబంధించినవగుటచేతను, అందుచేత నివి మనము పూర్ణముగా పొందినను మృగాదులకు కలుగు సుఖమునకంటె నెక్కువవి కానేరవు గనుకను, ఈభోగములయందు మృగాదులకులేని రోగాదికములగు బాధలు కొన్ని మనకెక్కువ యుండును గనుకను, ఆకష్టములతోఁ గూడిన సుఖమయినను శాశ్వతముగా నుండునది కాదు గనుకను, తెలిసినవారెవ్వరును నిమిషభంగురములయిన యీ తుచ్ఛసుఖములకే యాశపడి యుండరు. ధనమువలనను, వైషయికభోగములవలనను గలిగెడిసుఖమును క్షణభంగుర మయినదిగానే యుండును. ఈసత్యమును తెలిసికోలేక పలువురు పేరుకొఱకు తమధనమునంతను పాడుచేసికొందురు. వివాహాదులయందు భూరిదక్షిణలక్రింద తమధనమును పాడుచేసికొని పలువురు కూటిపేదలగుటయు నీప్రసిద్ధి కాశపడియే. ఈకీర్తి యొకనియొద్ద వ్యర్థపఱుచుటకు ధన మెంతకాలముండునో

యంతకాలముమాత్రమే యుండును. ధనదానమును చేయుచున్నంతె సేపును దాతలవిషయమయిన స్తోత్రపాఠము లాకాశమంటును; ఆధనదానము మట్టుపడినతోడనే స్తుతిపాఠములును మట్టుపడును. కాఁబట్టి పరుల పొగడ్తవలనఁ గలుగు సుఖమును చిరకాలముండునది కాదు. కాఁబట్టి ప్రాజ్ఞుఁడు పయినిజెప్పిన సుఖములలో దేనిని నమ్ముకొని యుండక, శాశ్వతసుఖము లభించుమార్గమును గనుఁగొని దానిని సంపాదించుటకయి సర్వప్రయత్నములును జేయును. శాశ్వతసుఖము లభించుమార్గము ధర్మాచరణ మొక్కటి తప్ప మఱియేదియు లేదు. ధర్మమార్గమునఁ జరించుచున్నచో మనమునస్సాక్షి సదా మెచ్చుకొనుచు నిజమయిన యానందము నిచ్చుచుండును. ఈలోకములో మనము పూర్ణముగా నూఱేండ్లు బ్రదికినను, ముందుండెడి యపరిమిత కాలమునుబట్టి విచారింపఁగా నిది పర్వతములో పరమాణువంతభాగమయిన నుండదు. కాఁబట్టి యెల్లవారును నీలోకములో నెల్లకాలమును దుఃఖముకలిగినను దానికయిన నోర్చుకొని, అపరిగణనీయమయిన భావికాలములో నెల్ల శాశ్వతసుఖము నిచ్చుటకు సమర్థమయిన ధర్మమార్గముననే సుఖము పొందుటకు ప్రయత్నపడవలయును. ఇట్లు చెప్పుటచేత ధర్మమార్గమున వర్తించుటచేత నిహలోకసుఖము కలుగదనియు, పరలోకసుఖము నపేక్షించి యిహలోకసౌఖ్యముల నెల్లను మానుకోవలయుననియు నాయభిప్రాయము కాదు. ధర్మమార్గప్రవర్తనమువలన నిజమయిన సౌఖ్య మీలోకమునందును గలుగును; ఈలోకమునందలి దేహసంబంధములయిన సౌఖ్యములన్నియు ననుభవింపఁ దగినవే. కాని పరలోకసుఖమునకు భంగము కలిగించువఱకు నీలోకసుఖములను త్యజించి, ఇక్కడ నెన్నియాపదలు వచ్చినను వానినెల్లను సహించి ధర్మమార్గముననే సంచరింపవలనని నామతము.

నేఁడీదినమునఁ జెప్పఁ బూనుకొన్న స్వయంకృషి యీపరలోక సుఖమునకు భంగము రాకుండ ననుభవింపవలసిన సమస్తసుఖసాధనములను గూర్చినదై యుండును. పశుపక్ష్యాదులకు వేనికిని లేని యుక్తాయుక్త వివేకము మనకు కలిగియుండుటచేతనే యీధర్మమార్గప్రవర్తనము మనకు విధిగా నేర్పడినది గనుక, ఇదియే నిజముగా మానుష ధర్మమునకు సంబంధించినదని చెప్పవలసియున్నది. మన కీశ్వరుఁడు జ్ఞానమును ప్రసాదించి యున్నను, దాని నంతకంత కభివృద్ధి పొందఁదగిన దానిఁగానే చేసియున్నాఁడు. కాని యొక్కసారిగానే పరిపూర్ణత్వమును పొందియుండునట్లు చేసి యుండలేదు. మన కీశ్వరుఁడు దయచేసియున్న సాధనకలాపములో నేదియు మనకృషిలేక యభివృద్ధి నొందునది లేదు. కాఁబట్టి జ్ఞానాభివృద్ధికిని మనకృషి యావశ్యకము. యుక్తాయుక్తవిచారమునుజేసి కర్తవ్యమును గనిపెట్టుటకొఱకే జ్ఞానము సాధనమగుటచేత, కార్యాకార్యనిశ్చయముచేసి యుక్తమార్గముననే నడవ తలంపుగలిగినవా రందఱును జ్ఞానాభివృద్ధికై సర్వప్రయత్నములు చేయవలెను. అన్యసాహాయ్యముక్కఱలేక మనుష్యుఁడేవిషయమునందును పూర్ణముగా పని సాగింపనేరఁడు. ఆలాగుననే జ్ఞానసంపాదనమునందుఁగూడ మనుష్యున కితరసాహాయ్యము తప్పక కావలసియుండును. జ్ఞానాభివృద్ధికి తోడుపడు ముఖ్యసాధనము విద్య యనఁబడును. తనకంటె పూర్వులు వ్రాసియుంచిన పుస్తకములను జదువుటవలనను, తనకంటె నధికబుద్ధిమంతులయిన వారితో సహవాసముచేసి తనకు తెలియనివిషయములను వారినడిగి తెలిసికొనుటవలనను సాధారణముగా జ్ఞానాభివృద్ధి యగును. ఇట్టి సాహాయ్యముక్కఱలేక స్వానుభవమువలననే జ్ఞానాభివృద్ధిని చేసికొనువాఁడు కోటికెక్కఁడనో యొక్కఁ డుండవచ్చినను సామాన్యముగా పయి తోడుపాటువలననే జనులు జ్ఞానాధికులగుదురు. కాఁబట్టి యెల్లవారికిని జ్ఞానాభివృద్ధిచేసి

కొనుటకై పుస్తకములును గురువులును కావలసివచ్చును. అయినను పుస్తకములన్నియు యథార్థమునే బోధించునవిగా నుండవు. గురువు లందఱును శిష్యులమేలుకొఱకే పాటుపడువారయియు నుండరు. కాఁబట్టి మంచిపుస్తకములనే యభ్యసించుటకును, ఉత్తములయిన గురువులనే యాశ్రయించుటకును జాగ్రత్తపడవలయును. పుస్తకములయొక్కయు గురువులయొక్కయు నుపయోగము మనలను జ్ఞానవంతులనుగాఁ జేయుటకును, బహువిషయములయందు మన యాలోచనను జొప్పించి సాధకబాధకములను విచారించి కార్యనిర్ణయము చేయ సమర్థులనుగాఁ జేయుటకును, గాని మనయాలోచనను పోఁగొట్టి వానియం దున్నదెల్ల నంధప్రాయముగా విశ్వసించునట్టు చేయుటకుఁగాదు. మనకు మునుపున్న జ్ఞానమునుగూడఁ బోఁగొట్టుటకు సాధనములగునేని, అట్టిపుస్తకములును గురువులును లేకుండుట మంచిది. కాఁబట్టి నిజమైన జ్ఞానమును సంపాదించవలెనని యున్న పక్షమున, పుస్తకమునందున్న యంశములనుగాని గురువు చెప్పిన వాక్యములనుగాని సందేహముకలిగినప్పుడు నిష్పాక్షికబుద్ధితో మఱిమఱి విమర్శించి తనబుద్ధి కవి సత్యములుగావని దృఢముగా తోఁచునేని యెవ్వరు వ్యతిరేకముగాఁ జెప్పినను తన మనస్సునకు స్థిరమని సిద్ధాంతమయిన ప్రకారముగానే ప్రవర్తింపవలయును. పూర్వము పుస్తకములను రచించినవారును గురువులును మిక్కిలి బుద్ధిమంతులే యయినను మనుష్యులగుటచే వారికిఁగూడ భ్రమప్రమాదాదులు సహజములే గనుక, వారును కొన్నివిషయములయందు పొఱపడి యుండవచ్చును. ఏదో యొకవిషయమునందు వారిప్రమాదమును మనము సంస్కరించినంతమాత్రమున వారిగౌరవమున కేహానియు కలుగదు; అది తరువాతివారు జ్ఞానాభివృద్ధిని పొందుటకును సాధనమగును. అంతియేకాక స్వప్రయోజనపరులయి తమలాభము

నిమిత్తమయి యసత్యములను బుద్ధిపూర్వకముగానే తమ పుస్తకములనిండ నెక్కించిన మహానుభావులును పలువు రుండియున్నారు. అట్టి స్వప్రయోజనపరులయిన పండితనామధారకులవలననే మనకు విశేషనష్టము కలుగును గాని మూఢజనులవలన నంతగా గలుగదు. ప్రతిదేశమునందును మతగురువులు స్వప్రయోజనపరులై వేదోక్తములని వేదబాహ్యములయిన సంగతులను పుస్తకములలో వ్రాసియు శిష్యులకు బోధించియు జనులను మోసముచేసి తాము లాభమును పొందుచుండుట సర్వసాధారణముగా జరుగుచునే యున్నది. అయినను గొన్ని దేశములలో విద్యాభివృద్ధియయి జనులలో నాగరికత యధికమైనకాలఁదిని మతగ్రంథములు దేశభాషలలో భాషాంతరీకరింపఁబడి వారిమోసములు మూలఁబడినవి. మనదేశములో సాధారణముగా తక్కువజాతులవారు విద్యాగంధమెఱుఁగక మూఢులుగానే యట్టె యుండుటవలనను, మతగ్రంథములు దేశభాషలలో భాషాంతరీకరింపఁబడక యుండుటవలనను, మతగురువుల మోసమీ దేశములో నిరర్గళముగా సాగుచున్నది. ఈయుపద్రవమును నివారించి దేశమునకు క్షేమము గలిగింపఁగోరు దేశాభిమానులగు మహాపురుషులందఱును జనులలో విద్యాభివృద్ధియగునట్లు చేయుటకును, మతగ్రంథములను తెనిఁగించుటకును, స్వలాభమునకయి గురుపరంపరలోనివారు వ్రాసికొన్న పుస్తకములయందలి దోషములను లోకమునకు వెల్లడిపఱిచి జనులకన్నులు తెఱచుటకును, సర్వవిధముల పాటుపడవలయును. అంతకంటె మనము లోకమునకుజేయు గొప్పయుపకారము మఱియొకటిలేదు. తమ్ము పూజించుటయు, తమకు ధనమిచ్చుటయు, తప్ప ముక్తికి వేఱుసాధనములులేవని వ్రాసి ధనాకర్షణోపాయముగా శ్రుతిస్మృత్యుక్తములుకాని పెక్కునోములను వ్రతములను కల్పించి తదనుగుణములైన కల్పములతో నిండియున్న పుస్తకము

లను చేసినవారిని మనమెందఱిని జూచుచున్నాము కామా? వాని యందు వారిని వారిజాతివారిని పూజించిననే పుణ్యమువచ్చునని బోధించుటతప్ప నిజమయిన భగవద్భక్తిని నీతిని యుక్తప్రవర్తనను బోధించువాక్యము లెక్కడనైనను గనుపట్టునా? అట్టి పుస్తకము లెంతశీఘ్రముగా నశించిన మనదేశమున కంతక్షేమము కలుగును. ప్రతిదేశములోను తెలిసినవారు మాత్రమే గురువులుగా నుండుట యాచారముగానున్నది. మనదేశమున మాత్రము పూర్వము తమ వృద్ధపరంపరలోనివారి కెవ్వరికో వారివృద్ధపరంపరలోనివారొకరు గురువులుగా నుండిరను హేతువుచేత వారివంశమునందు పుట్టిన పరమ శుంఠలు సహితము శిష్యపరంపరలోఁ జేరిన పండితులకుఁగూడ గురువు లగుట తటస్థించుచున్నది. గురుశుశ్రూషవలననే కాని ఫలసిద్ధిలేదని మనవారు చక్కఁగా మనసులకు నాటించి యుండుటచేత, శిష్యవృత్తాపహారు లగుట కెంతమాత్రమును చేతఁగాక శిష్యవిత్తాపహారులు మాత్రమే యయియున్న యీమహాగురువులపాదములు కడిగి నెత్తిమీఁద చల్లుకొనుచు పాదతీర్థమును లోపలికి పుచ్చుకొనుచు వారు చెప్పిన వాక్యములెల్ల వేదవాక్యములని భావించి యాదరించుచు జనులు తమధనమును వారికి కొల్లపెట్టుచుందురు. ఈహేతువుచేత మనదేశమున కితరదేశములలో లేని నష్టములుకూడ నీగురుపరంపరవలనఁ గలుగుచున్నవి. ఈగురువేషధారులు తమయింటనున్న స్థావరజంగమ స్వత్వము తోడిపాటుగా తమశిష్యగణమునుగూడ భాగములు వేసి పంచుకొనుచు జ్ఞానమునందుఁగూడ వారిని తత్తుల్యులనుగానే చేసి ధనాపహరణము చేయుచుందురు. ఈవిధమైన వృత్తిచేతనే జీవనము చేయువారు మఱియొకవిధముగా బోధించి సత్యమును వెల్లడి చేసినచో తమవృత్తికే భంగము కలుగును గనుక వారు సర్వవిధముల నీయాచారమునే కాపాడుచు తమకు వ్యతిరిక్తముగా సత్యము బోధింపఁ

జూచువారిని నాస్తికులనియు, బౌద్ధులనియు, మతదూషకులనియు పేరునుపెట్టి దూషించుచు పామరులను భ్రమింపఁజేయుచుందురు. కష్టార్జితవిత్తమువలన జీవనము చేయఁదగిన న్యాయమయిన వృత్తి యేదియు లేక పరులను మోసపుచ్చి వారు సంపాదించుకొన్నదాని మూలముననే జీవనము చేయవలసినవారీదేశములో నసంఖ్యముగా నున్నారనుట యెల్లవారికిని తెలిసిన విషయమే. అట్టివారిసంఖ్య క్షీణించువఱకును మనదేశము మంచిస్థితికి రానేరదు; పరులను యాచించి జీవనము చేయుటకంటె హేయమయినవృత్తి లోకములో మఱియొకటి లేదనియు, శరీరప్రయాసపడి న్యాయార్జితమైన ధనముతో కుటుంబసంరక్షణము చేసికొనెడి యేయధమవృత్తియైనను యాచ్ఞావృత్తికంటె వేయిరెట్లు మేలయినదనియు, వారిమనసులలో నాటించి కొంతవఱకైనను వారినావృత్తినుండి విముఖులను జేసినం గాని దేశాభివృద్ధికయి పాటుపడువారి ప్రయత్నములు సహితము నిరంతరాయముగా సాగనేరవు. ఇట్లు చెప్పుటచేత గురువు లక్కఱ లేదనియు, చదువక్కఱలేదనియు, నాయభిప్రాయ మెంతమాత్ర మును గాదు. తనకంటె బుద్ధిశాలులును విద్యాధికులును నయిన వారితో సహవాసము చేయుచుండిననేకాని మనుష్యుఁ డెప్పుడును జ్ఞానాభివృద్ధిని కాంచనేరఁడు; అట్టిమహనీయులతోడి సహవాసమున కన్నను జ్ఞానాభివృద్ధికి మంచిపుస్తకములు పరమప్రయోజనకరములు. గొప్పవారితోడి సాంగత్యమువలనను, సద్గ్రంథపఠనమువలనను మనకుఁ గలుగవలసిన ప్రయోజనము మనలో శోధనయును తత్త్వవిమర్శనమును వృద్ధియయి మనముకూడ గొప్పవార మగుటయే. అట్లుగాక గురువులశుశ్రూష మనలను స్వతంత్రులనుగాను సత్కార్యాచరణము నందు ధైర్యవంతులనుగాను జేయక మనలను వారికి దాసులనుగా మాత్రముచేసి స్థావరపదార్థములనువలె వారాడించినట్లెల్ల నాడు

చుండునట్లు చేయు నేని, అట్టిగురువులు లేకపోవుటయే మిక్కిలి యుత్తమ పక్షము; మనము చదివెడి పుస్తకములు మనలను జ్ఞానవంతులనుగాను సత్ప్రవర్తనము గలవారినిగాను జేయక యొకతెగవారిచేతులలో పనిముట్లవంటి వారినిగాఁ జేయు నేని, అట్టిగ్రంథములను చదువకపోవుటయే బహుశ్రేయస్కరము. విద్య సత్యమును తెలుపుటకును యోగ్యులనుగాఁ జేయుటకును సాధనమయినదేకాని స్వాంతప్రయోజనము కలది కాదని యీవఱకే సూచనగాఁ జెప్పియున్నాను. మనవారీసత్యమును మఱచిపోయి ప్రవర్తనమును విచారింపక విద్యనే పూజించుచున్నారు. అందుచేతనే మనదేశమున కనేకములయిన చెడుగులు మూడుటకుఁ గారణమయినది. మనవారు నడత మంచిది కాకపోయినను దానిని పాటింపక వ్యాకరణమునో మఱి యేయితరశాస్త్రమునో యభ్యసించినాఁడన్న హేతువుచేత నాతనిని నతిగౌరవము చేయుచు నాతని మాటలనన్నింటిని వేదాక్షరములనువలె విశ్వసింతురు. ఎన్ని శాస్త్రములను జదివినను నీతివర్తన ముండదేని, అట్టివాఁడు మానవ రూపముననున్న ఘోరరాక్షసుఁడుకాని యంతకంటె నేవిధమునను అధికుఁడు కానేరఁడు. రాక్షసులు విద్యయందును, బుద్ధియందును, బలమునందును, దేవతలకంటె నధికులేయైనను వారు గర్హ్యులగుటకును దేవతలు పూజ్యులగుటకును గారణము రాక్షసుల దుర్గుణములును దేవతలసద్గుణములును తప్ప మఱి యేదిగలదు? కాఁబట్టి యెప్పుడును యుక్తప్రవర్తన మహనీయమైనదిగాని యదిలేని వట్టివిద్య కాదు. అదిగాక పండ్రెండుసంవత్సరములు వ్యాకరణశాస్త్రమునుగాని తర్కశాస్త్రమునుగాని గుడ్డిపాఠముగా మొదటినుండి చివరవఱకును చదువుటవలనఁగాని, అర్థమెఱుఁగక వేదమును రోఁకటిపాటగా వల్లెవేయుట వలనఁగాని కావ్యాలంకారనాటకముల నభ్యసించి నృత్తగీతాదుల యందు సమర్థులగుటవలనఁగాని యెవ్వరును జనులకు జ్ఞానోపదేశ

మును జేసి వారిని నడుపుట కర్హులుకారు. గుడ్డిపాఠముగా చదివిన చదువంతయు వ్యర్థమయినదే కాని ప్రయోజనకరమయినది కాదు. అర్థయుక్తముగాఁ జదివిన నీతిశాస్త్రములును తత్త్వశాస్త్రములును మాత్రమే పురుషులను జ్ఞానోపదేశకర్తలనుగాఁ జేయ సమర్థములగును. తక్కిన శాస్త్రములు సహిత మాయావిషయముల యందు పరమ ప్రయోజనకరములే యయినను, జనులకు పరమార్థమును బోధించి వారి ప్రవర్తనమును చక్కఁజేయుటకు మాత్రము పనికిరావు. కాఁబట్టి మన ప్రయత్నమంతయు దేశభాషలో నీతిగ్రంథములను ప్రకృతిశాస్త్రములను భగవద్భక్తిప్రతిపాదక పుస్తకములను సులభశైలిని రచియించి యెల్లవారికిని సుబోధములుగాఁ జేయుటయయి యుండవలెను. విద్య జ్ఞానమును పుట్టించును; ఆ జ్ఞానము యోగ్యముగా ప్రవర్తింప జేయుట కనుకూలపడవలయును. అంతే కాని యూరకే యిది మంచిదని తెలిసికొనుటవలన నేమియు ప్రయోజనములేదు. తెలిసినందుకు తప్పక యాప్రకారముగా నడవవలయును. కాఁబట్టి మన కృషి యాత్మకుఁగల గుణములలో నొకటియైన తెలివిని వృద్ధిపఱుచుకొనుటలో మాత్రమే కాక నీతిగుణమును ప్రేమాదులగువానిని కూడ సమానముగా నభివృద్ధిపొందించుటలో వినియోగపడవలెను. శరీరావయవములవలెనే యాత్మగుణములును పరస్పరము సమానముగా వృద్ధిపొందిననే సుఖదాయకములగును గాని యొకటి పెరిగి యొకటి తఱిగినచో సుఖప్రదములు కానేరవు. ఒక్కతలగాని, కడుపుగాని, కాలుగాని మిక్కిలి పెద్దదయి తక్కిన యవయవములు పెరుగకపోయినచో శరీరమున కెంత యసౌఖ్యముకలుగునో యెల్లవారికిని తెలిసియే యుండును. ఆ ప్రకారముగానే తెలివిమాత్రము వృద్ధినొంది నీతిలేకపోయినప్పుడుగాని నీతిగలిగి తెలివిలేకపోయినప్పుడుగాని, ఈ రెండును గలిగి భగవద్భక్తి లేనప్పుడుగాని, ఆత్మకు నిజమయిన సుఖముకలుగఁ

జాలదు. కాఁబట్టి యన్నిగుణములును సమానముగా పెరుగునట్లు చేయుటకయి మనము కృషి చేయవలెను. అప్పుడే సత్యమయిన సుఖము కలుగును. ఎల్లవారును శాశ్వతసుఖమునే కాంక్షింతురు. ఆశాశ్వతసుఖము మనకుఁగల సమస్తగుణములను శక్తులను సమానముగా వృద్ధిపఱుచుకొని భగవదాజ్ఞానుసారముగా నడుచుకొనుట వలనఁ గలుగును. భగవదనుగ్రహమును గోరి యాతని తృప్తికయి మనము విధాయకకృత్యములను చేయుచువచ్చినచో మన కెప్పుడును నసంతుష్టియు నసౌఖ్యమును గలుగవు. పయివారు లక్షమంది మనలను ద్వేషించుచున్నను మనయంతరాత్మ మనలను సంతోషపెట్టుచుండును. మనయానందము మనమనస్సులో నున్నది గాని బాహ్యప్రపంచమునందు లేదు. మనలను పయివారు కోటిమంది భూషించుచున్నను దుష్కార్యమును జేసితిరని లోపల నంతరాత్మ దూషించుచున్నయెడల మన కెంతమాత్రమును సౌఖ్యము లేదు. కాఁబట్టి మనము నేర్చుకొను విద్య యింతవారమయితిమిగదా యను మనస్సంతోషముకొఱకుఁ గాని, ఆధిక్యముకొఱకుఁ గాని, లాభముకొఱకుఁ గాని అయియుండక మనప్రవర్తనమును తిన్నపఱుచుకొనుటకొఱకును పరోపకారము నిమిత్తమును నయి యుండవలెను. అప్పుడా మనస్సంతోషాదులు తమయంతఁ దామే వచ్చును. మనవిద్యయొక్క ఫలము కామక్రోధాదులను నిగ్రహించి సత్యశౌచపరోపకారాదిగుణములను పయికిఁ దీయుటయే. అట్లుచేయుటయే యింద్రియనిగ్రహ మనఁబడును. కామాదులగు నరివర్గమునకును, సుగుణములకు స్థానమయిన యంతరాత్మకును ప్రతికార్యమునందును లోపల సదా యుద్ధము జరుగుచుండును. ఒక చక్కని సుందరిని చూచినతోడనే కామగుణ ముద్రేకించి దానిని గవయఁ జూచుచుండును; అప్పు డంతరాత్మ యడ్డువచ్చి పరకాంత కాసించుట దోషమని బోధించి వారింపఁ

జూచుచుండును. ఆపోరాటములో నొకవేళ కామమే విజయమునొందియా సుందరి పొందు లభించినను అది దొంగవలె నొకమూల నొదిగియుండి యెవ్వరేమనుకొందురో యని సిగ్గు పడుచుండవలసినదే కాని నలుగురిలోను చెప్పుకొని నిర్భయముగా తల యెత్తుకొని తిరుగ వలనుపడదు; అంతరాత్మయే విజయము నొందియా కానిపనిని మాన్పింపఁ గలిగెనా మనసునకు తృప్తియు సంతోషమును లోకమువలన మెప్పును కూడఁ గలుగును. కాఁబట్టి బుద్ధిమంతుఁడగువాఁడు మొదటినుండియు నింద్రియములను బుద్ధికి లోఁబడునట్లు చేసి యంతరాత్మ చెప్పినట్లు నడుచుకొనుట కలవాటు చేసికొనవలయును. అట్లు చేసినప్పుడే విద్య సార్థకమగును. మఱియును మనము సత్యమును గ్రహింపవలెనను నుద్దేశ్యముతోనే సదా విద్య నభ్యసింపవలయును. సత్యమును కనుఁగొనవలెనను నాసక్తి లేక తమసామర్థ్యమును గనఁబఱిచి ప్రఖ్యాతి గాంచవలెనను నాశతో పనిచేయుటచేత గొప్ప బుద్ధిమంతులు సహితము విపరీతసిద్ధాంతముల నేర్పరిచి తాము మోసపోవుటయేకాక జనులను సహితము భ్రమింపఁజేసి వారిని తప్పుమార్గమునఁబెట్టి నడిపించుచు వచ్చుచున్నారు. కాఁబట్టి మనయుద్దేశ మెల్లవిధముల సత్యమును గ్రహించుటకే యయి యుండవలయును. సత్యమును గ్రహింపవలయునను దృఢనిశ్చయము కలవారయి యెల్లవారును తమకున్న మనోగుణముల నన్నిటిని వృద్ధిచేసికొనుటకయి కృషిచేయవలెను. జనుల ముఖలక్షణములయందును కంఠస్వరమునందును పరస్పర భేదమున్నను కర్ణనాసికాద్యవయవములును నుచ్చారణ క్రమమును సామాన్యముగా నున్నట్టే మనుష్యుల బుద్ధియందును పరస్పర భేదమున్నను సామాన్యగుణములు సహితము పెక్కులు గలవు. ఆ యా మనుష్యు లాయావృత్తులకు పనికివచ్చుటకయి బుద్ధియందును వాంఛలయందును భేదమవ

శ్యముగా నుండవలసినదే. కొందఱు గణితాది శాస్త్రములయందు బుద్ధి వ్యాపించువారుగాను కొందఱు గానవిద్యాదులయందు ప్రవేశించు బుద్ధిగలవారుగాను కొందఱు శిల్పములయం దాసక్తికలవారుగాను కొందఱు వస్త్రాదినిర్మాణమునందు తమశక్తిని గనఁబఱుప వాంఛగలవారుగాను నానావిధముల నుందురు. వాని వాని యభిరుచినిబట్టి ఆయావృత్తులకుఁదగిన విద్య నేర్పవలసినదే కాని యంతటితో మాత్రము తృప్తినొంది యూరకుండక యందఱకును సామాన్యముగానుండు గుణములను వృద్ధిఁబఱుపఁజాలిన విద్యను కూడ తప్పక నేర్పవలయును. అట్టి విద్య యన్నివృత్తులకును గూడ నావశ్యకమే. ఒకఁడు రాజైనను, కాపైనను, వాణిజ్యము చేయుచున్నను, కృషి చేయుచున్నను, మట్టికుండలు చేయుచున్నను, బంగరునగలు చేయుచున్నను, చిత్రములు వ్రాయుచున్నను, గోడలకు మట్టిపూత పెట్టుచున్నను, లోకములోఁగల మరి యే వృత్తియందున్నను, తనవారియందు ప్రేమయు పరోపకారచింతయు భగవంతునియెడల భక్తియు యుక్తప్రవర్తనమును కలిగి యుండవలసినదే. అట్లున్నంతవఱకే జనుఁ డేవృత్తియందున్నను ప్రకాశించును. కాఁబట్టి వృత్తులకుఁ గావలసిన విద్యకంటెను ఈ కడపటఁ జెప్పినవానిని వృద్ధిపఱుచువిద్యయే ప్రతిమనుష్యునకు నవశ్యసంపాద్యము. నీతి మొదలగునవి లేకపోయినయెడల నెంత తెలివిగలవాఁ డేవృత్తియందున్నను గౌరవింపఁబడఁడు; వృత్తులకుఁ గావలసినవిద్య కొందఱికి రాకపోవచ్చునుగాని యుక్తాయుక్తవివేకమును పుట్టించువఱకుఁ జాలినవిద్య కృషి చేసినయెడల మనుష్యమాత్రున కెవ్వరికిని రాకపోదు. నీతి మొదలయినవి యున్నయెడల మనుష్యుఁ డేవృత్తియం దున్నను గౌరవింపఁబడును. అది తెలియక యీదేశములో నల్పవిద్యను నేర్చినవారు సాధారణముగా తమవృత్తులు నీచము లయినవని భ్రమించి నాలుగక్షరములు

రాఁగానే తమ తొంటివృత్తులయందుఁ ప్రవేశింపనొల్లక యధమ వృత్తియైన సేవకవృత్తి కాశపడి రాజకీయోద్యోగములకయి తమ శక్తినంతను ధారపోసి కష్టపడుచున్నారు. లోకములో న్యాయమయిన వృత్తులన్నియు గౌరవావహము లయినవేకాని యందొక్కటియు గౌరవహీనతను దెచ్చునదిలేదు. ఎంత మంచివృత్తియందైనను మూఢులును నీతిమాలినవారును ప్రవేశించినపక్షమున నది హీనమయిన దగును; ఎంత నీచముగా చూడఁబడు వృత్తియందైనను చదువుకొన్నవారును నీతిమంతులును ప్రవేశించినతోడనే దానికి గౌరవము వచ్చును. కాఁబట్టి మనదేశములో చదువుకొన్నవారు వివిధవృత్తులయందుఁ బ్రవేశించి వానికి గౌరవమును తెచ్చి యీవఱకు జనులలోఁగల దురభిప్రాయమును పోఁగొట్టవలయును. వృత్తులు క్రమపడినంగాని దేశ మెన్నటికిని భాగ్యసంపన్నము కాఁజాలదు. చదువుకొన్నవారు వృత్తులయందుఁ బ్రవేశించినచో మంచిసాధనములను కనిపెట్టి పనిని సులభపఱుచుటయేకాక విస్తారలాభకరముగా కూడ చేయవచ్చును. వృత్తులు కొన్ని యిప్పుడు నీచములుగా కనఁబడుచుండుట చదువుకొన్నవారందు ప్రవేశింపకపోవుటచేతనే కాని వేఱుకారణముచేత కాదు. తెలివిగలవాఁడు నీతిమంతుఁడయి యే వృత్తియందున్నను గౌరవమునకు లోపమురాదని దృఢముగా మనసునందు నమ్మి సమస్తవృత్తులను మంచిదశకు తెచ్చుటకు ప్రయత్నించుచు నీతి మొదలయిన యాత్మశక్తులనన్నిటిని వృద్ధిపఱుచుటకై తగినంతకృషి చేయుచుండవలెను. మనదేశమునందు వృత్తులు మిక్కిలి హీనదశయందుండుటచేతనే మనకు సామాన్యముగా కావలసినవస్తువులు సహిత మితరదేశములనుండివచ్చి మనసొమ్మంతయు నితరదేశములపాలయి మనదేశ మంతకంతకు బీదస్థితికి రావలసినంతగతి పట్టినది. మనదేశమునం దుపయోగపడెడు కత్తులు మొదలగునవి యితర దేశ

ములనుండియే వచ్చుచున్నవి; కట్టుకొను బట్టలు బహుతరముగా పరదేశములనుండియే వచ్చుచున్నవి; వ్రాసికొనుకాగితములన్నియు నన్యదేశములనుండియే వచ్చుచున్నవి. చదువుకొన్నవారును ధనికులును వృత్తులను వృద్ధిపఱుచుటకయి తగినంతకృషిచేసి యీదేశమునందే ఆయా పనులకు తగినయంత్రములను స్థాపింపఁజేసి పని సాగించినంగాని లేనియెడల కొంతకాలములోనే మనదేశములోఁగల ధనమంతయు నన్యదేశముల పాలయి పోవుననుటకు సందేహము లేదు. అన్నివృత్తులయందును ప్రవేశించి వానిని వృద్ధిపఱుచుటకు చాలినంతమంది చదువుకొన్నవారు బయలుదేఱుటకయి జనసామాన్యమునకు విద్య చెప్పింప సాధ్యమయినంత ప్రయత్నము చేయవలయును. జనసామాన్యమునకు విద్యాభివృద్ధియైనంగాని దేశముయొక్క స్థితి బాగుపడదు. పనిచేసి జీవనముచేయు తరగతులవారికి చదువుకొనుటకయి తీఱుబడి యుండదని కొందఱు చెప్పుదురు. అది కొంతవఱకు నిజమేకాని చదువుకోవలెనని యాసక్తియున్నచో నవకాశ ముండకపోదు. అట్టివారల యుపయోగమునకయి రాత్రులయందు విద్యచెప్పు పాఠశాలలను స్థాపింపవలయును. అట్లన్నచో పగలెల్లను పనిచేసి వచ్చినవారికి కొంచెమయినను విశ్రాంతిలేక రాత్రులుకూడ చదువుకొనవలెనన్నచో మిక్కిలి భారముగా నుండునని కొంద ఆక్షేపింపవచ్చును. పగలు పనిచేసి వచ్చిన వారికి మంచిపుస్తకములను జదువుటయే యొక విధమయిన విశ్రాంతిగ నేర్పడి సంతోషకరముగాను శ్రమనివారకముగానుకూడ నుండును. చదువుకోవలెనని బుద్ధియున్నచో నితర సమయములయందు సహితము కావలసినంత యవకాశమును కలుగఁజేసికోవచ్చును. పుస్తకములు, ఉపాధ్యాయులు, ఇతరసాధనములును కావలసినన్ని యుండియు ధనికులపిల్ల లోకభాషనైనను పూర్ణముగా నభ్యసింపలేకపోవుటయు, అట్టిసాధనము లేవియు లేకపోయినను పని

వాండ్రబిడ్డలు సహితము కొందఱు విద్యాభిరుచిగలవారై కొంచెము తీఱిక చేసికొని చదివి స్వయంకృషిచేత బహుభాషలయందు పండితులయి గొప్పవారగుటయు, ఇతరదేశచరిత్రములనుబట్టి మనము తెలిసికొని యున్నాము. మఱియును విద్యవలన జనసామాన్యముయొక్క స్థితి బాగుపడువఱకును మనస్థితియు బాగుపడనేరదు. వారు మూర్ఖులుగానే యున్నయెడల వారు మనము చేయఁబూనుకొన్న దేశక్షేమకరకార్యములకును మన మాచరింపఁబూను సత్కార్యములకును ప్రతిబంధములను గల్పించుచు దేశాభివృద్ధికిని మన యభివృద్ధికినిగూడ భంగము కలిగింతురు. అనేకులు విద్యావంతులయి విదేశములకు వెళ్ళి సామయికపరీక్ష నిచ్చి గొప్పయుద్యోగములం బ్రవేశించి దేశమునకు మేలు చేయవలె నను తలంపు గలవారయ్యు మూఢులయిన కులమువారు తమ్ము బహిష్కరింతురని భయపడి యేమియు చేయనేరక యూరకుండఁగా మనము చూచుచున్నాముఁకామా? ఎంతమంది వివాహాదులయందలి యతివ్యయమును మానుకొనఁదలఁచియు మూఢులయిన సామాన్యజనుల దూషణములకు వెఱచి మాన్యములో మడులో తాకట్టు పెట్టుకొని సోమరిపోతులను మేపుటకయి వందలకొలఁది రూప్యముల వెచ్చపెట్టవలసినవా రగుచున్నారు? అతిబాల్యవివాహము దూష్యమని యెఱిఁగియు దానిని వారింప నెంతో యిష్టముండియు జనుల మౌర్ఖ్యమువలన వారల మరలింప శక్యముగాక కులమునుండి తొలఁగింతురేమో యను భీతిచేత నెందఱు తమ కొమార్తెలకు సహితము బాల్యములోనే వివాహము చేయవలసినవా రగుచున్నారు? స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమని స్పష్టముగా తెలిసియుండియు దాని నుద్ధరించుట లోకోపకారమని రూఢిగా నమ్మియు తా మట్టిపనియందుఁ బ్రవేశింప నత్యంతాభిలాష కలిగియుండియు, ఆ పేరుచెప్పిన పులులవలె కఱవవచ్చు మూర్ఖజనుల బెద

రింపులకు భయపడి యెంతమంది తమ గర్భవాసమునఁ బుట్టి పతులను
పోఁగొట్టుకొని దురదృష్టవంతురాండ్రయియున్న పసిబాలికలకు సహి
తము వివాహము చేయఁజాలక యావజ్జీవమును వారిని దుస్సహ
దుఃఖము పాలుచేసి కన్నకడుపు దహించుకొనిపోవ తాముకూడ తీరని
వ్యథ ననుభవింపవలసిన వారగుచున్నారు? తెలియని జనుల యుప
హాస్యములకు జడిసి యెందఱు తమ దేహసంరక్షణార్థ మనుకూలమైన
వస్త్రములను ధరించుకొనుటకును పాదరక్షలను తొడుగుకొనుటకును
సందేహపడుచున్నారు? కాఁబట్టి మొట్టమొదట జనసామాన్యమునకు
విద్య నేర్పించు నుపాయమును జూడవలెను. సామాన్యజనులు మాత్రమే
కాక మన యభివృద్ధి కడ్డమువచ్చెడువారు మఱియొక తెగవారుకూడఁ
గలరు? మూర్ఖురాండ్రయిన మన స్త్రీలుగూడ మనము చేయఁ
బూనిన ప్రతిసత్కార్యమునకును ప్రతిబంధకారిణులుగా నుండుట
స్వానుభవమువలన మనకందఱకును దెలిసియే యున్నది. వారు సదా
మనతో నుండి పోరుచుండుటచేత వారి కిష్టములేని పనినిచేసి యింట
నెమ్మదితో నుండుట దుర్ఘటము. మూర్ఖపువట్టు పట్టి నిష్కారణముగా
ప్రాణత్యాగమునకు సహితము సిద్ధపడు భార్యలను తల్లులను తమమార్గ
మునకు త్రిప్పఁజాలక వారికిజడిసి యెంతమంది తెలిసినవారు తాముకూడ
మూర్ఖులవలె ప్రవర్తింపవలసిన వారగుచున్నారుకారు? ఎంతమంది
సభలలో దేశాభివృద్ధికరములైన పనులను జేయుటనుగూర్చి ప్రసం
గించుటలో సింహములవలె నుండియు పనికిమాలిన యాఁడువారికి
భయపడి యింటికి వచ్చినతోడనే యాచరణముమాట యటుండఁగా
సభలలో చేసిన యుపన్యాసాంశములను బిగ్గరగా పలుకనైనను సాహ
సింపలేక పిల్లులవలె నొదిగియుండవలసినవా రగుచున్నారు? సామా
న్యజనుల ప్రతిబంధమునకంటెను మనకు స్త్రీలదే గొప్పప్రతిబంధము.
కాఁబట్టి స్త్రీలకు విద్య చెప్పించుట యెల్లవారికిని ప్రథమకర్తవ్యము.

మనము నిజముగా నభివృద్ధి చెంద నపేక్షించినచో సాధ్యమయినన్ని బాలికాపాఠశాలలను రాత్రిపాఠశాలలను బెట్టించి స్త్రీలను సామాన్యజనులను విద్యగలవారినిగాఁ జేయవలయును. పాఠశాలలున్నను జ్ఞానాభివృద్ధి కనుకూలమయిన పుస్తకములు లేకపోయినయెడల మన ప్రయత్నము కొనసాగదు గనుక మనలో శక్తికలవా రందఱును దేశభాషలలో సులభశైలిని గ్రంథములను రచియించుటకు వెంటనే పూనవలయును. స్త్రీలలోను సామాన్యజనులలోను చదువుకోకుండ తెలివిగలవారును సత్కార్యమునకు తోడుపడువారును లేరా యని కొంద ఱడుగవచ్చును. అట్టివా రక్కడక్కడ నొకానొక రుండవచ్చును గాని జనసామాన్యముమీఁద విద్యలేక జ్ఞానవంతులు గుణవంతులు నగుట సంభవింపనేరదు. గనులలో దొరకెడురత్నమువలెనే వికాసము నొందెడుబుద్ధి స్వాభావికముగానే పలువురకున్నను విద్యచే మెఱుఁగు పెట్టినంగాని దాని ప్రకాశమంతయు వెల్లడియయి లోకమున కుపయోగపడదు. విద్యాభివృద్ధి యగుట యొక్క పుస్తకములమూలముననే గాక వినోదకరములును నీతిబోధకములును జ్ఞానజనకములునైన విషయములను సమయోచితముగా వ్రాయు వార్తాపత్రికలమూలమున కూడ విస్తారముగా నగును. గనుక, అట్టి దేశభాషావృత్తాంతపత్రికలకు గూడ తగినంత ప్రోత్సాహమును కలిగింపవలయును. మిత్రులారా! ఈ పయినిచెప్పిన సంగతులను మీ మనసులయం దుంచుకొని మీమీ చేతనయిన విషయములలో పనిచేసి దేశాభివృద్ధికయి పాటుపడుఁడు. ఈ ఘనకార్యము మనమందఱముఁ గలిసి పనిచేసినం గాని యొక్కని వల్ల నెఱవేఱునది కాదు. రేపటినదిము మనది కాదు. కనుక వెంటనే పనికి పూని భూమిమీఁద మనజన్మములను సార్థకపఱుచుకొనుటకయి యెల్లవారమును బ్రయత్నింతము. కొందఱింకను కాలము రాలేదు రాలేదని యేమియు లోకోపకారము చేయఁజాలక తమ

కాలమును వ్యర్థపుచ్చుచున్నారు. ప్రారంభింపక యాకాశమువంక చూచుచు నూరకున్నచో కాల మెప్పుడును రానేరదు. పనికి పూని చేయ నారంభించినచో కాలము తనంతనే వచ్చును; రాకున్నచో మనము కాలమును బలవంతముగా నీడ్చుకొనియైనను రావచ్చును. మఱికొందఱు పని కారంభించి విఘ్నములకు జడిసి పూనినకార్యమును నడుమ విడిచిపెట్టుచున్నారు. మనము తొందరపడిన కార్యము లేదు. గింజ నాటినతోడనే యది వృక్షమయి కాయలు కాయదు. ఒక్క నారికేళఫలమును భూమిలో నాటిన పక్షమున దానిఫలముల ననుభవించుటకయి పదిసంవత్సరములైనను కాచుకొని యుండి యీలోపల చెట్టును బ్రతికించుటకయి సమస్తకష్టములను పడుచుండవలయును. అటువంటి యత్యల్పఫలము- విషయముననే యింతకాలము కనిపెట్టుకొని యుండవలసి యుండఁగా లోకమునకంతకు ననంతములయిన ఫలములనిచ్చు నుత్కృష్టవిషయములలో నేఁడు కాలేదే రేపు కాలేదే యని తొందరపడి పూనిన కార్యమును నడుమను విడిచిపెట్టిన మనము హాస్యాస్పదులము కామా? తొందరపడక కార్యగౌరవమునుబట్టి ఫలానుభవమునకయి తగినంతకాల మోర్పుతో కనిపెట్టుకొని యుండి కృషి చేయుచుండవలెను. మొదట మనప్రయత్నము విఫలమైనచో మనకార్యము సఫలముగువఱకును మానక మరల మరల ప్రయత్నము చేయుచుండవలెను. ఒకవేళ మనము దానిని ముగింపలేకపోతిమా మనతరువాతివారు ముగించెదరు; మనము కట్టిన యిండ్లును, తోఁటలలో నాటినవృక్షముల ఫలములును తఱుచుగా మనసంతతివారి కుపయోగపడునట్లే మనము నాటిన సత్కార్యబీజములును తరువాత మొలకయెత్తి యాకులువేసి కొమ్మలుహెచ్చి మహావృక్షమయి దేశమంతటను వ్యాపించి యమూల్యములయిన ఫలములనిచ్చుచు లోకమున కంతకును సుఖము నియ్యవచ్చును. విత్తనము నాటితిమని యైన మనకు తృప్తికలుగును. ఎంతటి

సత్కార్యమున కయినను పలువురు ప్రతిపక్షు లేర్పడుటచే విరోధము లును, ప్రతిబంధములును, విఘ్నములును రావచ్చును. అటువంటి వాని వలన మన మెప్పుడును నిరుత్సాహులము కాఁగూడదు; అవియే యిట్టి సమయములలో మనలను ధైర్యశాలులనుగాను సుస్థిరులనుగాను జేయుటకయి తోడుపడు సాధనము లగునట్లుగా చేసికొనవలయును. అటువంటి సమయములలో ప్రతిబంధముల నన్నిటి నెదిరించి దృఢముగా నిలిచి మన కార్యమును సాధించుకొనఁగలిగినంగాని మనము నిజముగా గొప్పవారమును సత్కార్యనిరతులమును గానేరము. కష్టములు వచ్చి నప్పుడే యుపయోగపడని ధైర్యము మఱి యెప్పటి కుపయోగించును? ఇట్టి ధైర్యము కలిగియుండుటచేతనే శక్తిమంతులు చేయలేని కార్యములనేకములను శక్తిహీనులు పూనికతో సాధించియున్నారు; అది లేకపోవుటచే సమర్థులుసహిత మత్యల్పకార్యములను సాధింపలేక యున్నారు. సత్కార్యములు చేయవలెనని బుద్ధి యున్నమాత్రమున కేవలము ప్రయోజనము లేదు. కార్యమును సాధించుటకై మొట్టమొదట మనము ప్రయత్నము చేసెడియెడల కార్యమును సాధింపఁగలమను నమ్మకమును నుత్సాహము నుండవలెను; తరువాత సరిగా పనియందు ప్రవేశించి పూనికగలిగి పాటుపడవలెను; అటుపిమ్మట నెన్నివిఘ్నములు వచ్చినను వెనుకతీయక యీశ్వరముఖమును జూచి ధైర్యముతో ప్రయత్నమును మానకుండవలెను. మనలను ఘనకార్యములను నిర్వహించుటకు శక్తులనుగాఁ జేయునది యొక్క యీశ్వరభక్తియే; అది లేనిచో విశేషశక్తిమంతులును కార్యనిర్వహణమునందు దుర్బలు లగుచున్నారు. మనము లోకోపకారకమయిన యొక క్రొత్తపనికి పూనుకొనఁగానే బహుజనులు మనకు ప్రతిపక్షులుగా నేర్పడి మితిమీఱిన విఘ్నముల నాపాదించి బాధించుచున్నప్పుడును లోకమునకు వెఱచి మిత్రులుసహితము మనలను విడనాడినప్పుడును మనకు ధైర్యసాహస

ములనొసంగుటకును మనల నుత్సాహపఱుచుటకును భగవంతుని ప్రాపుగాక మఱియేమికలుగును? రాజాధిరాజులకెల్లను ప్రభువయి నిగ్రహానుగ్రహసమర్థుఁడయిన పరమేశ్వరుఁడు మన హృదయసింహాసనము నధిష్ఠించియుండి చేసిన సత్కార్యమును మెచ్చి శాశ్వతసుఖమిచ్చెదనని యంతరాత్మద్వారమునఁ బలికి ప్రోత్సాహపఱుచుచు మనకు సహాయుఁడయి యుండఁగా, దుర్బలులయిన మానవాధములు కోటిమంది ప్రతిఘటించి నిలిచినను వారి తుచ్ఛమయిన కోపమునకు జడిసి వెనుకతీయుదుమా? సర్వాంతర్యామియైన యీశ్వరుఁడు చెంతనుండి చూచుచుండఁగా మనకు విధియైన కృత్యమును చేయక మూఢుల యనుగ్రహమునకాశపడి యూరకుండ నెట్లు సాహసింపఁగలము? మనము భగవంతునిప్రాపునే నమ్ముకొని కార్యభారము నాతనిమీఁదవేసి పని సాగించుచో సత్కార్యాచరణమునందు ప్రోత్సాహమును ధైర్యమును, అకార్యకరణమునందు నిరుత్సాహమును, భయమును కలిగించి కాపాడి మన కతఁడే నిత్యానందము నిచ్చును.